# జార్ఖండ్

# అటవీ సంరక్షణ (సవరణ) చట్టాన్ని వ్యతిరేకిస్తూ హెచ్ జె కె డి ధర్నా- బహిరంగ సభ

**అటవీ** సంరక్షణ (సవరణ) చట్టం-2023ను వ్యతిరేకిస్తూ, ఆదివాసుల నుండి మూలవాసుల నుండి గుంజుకొన్న భూములను వెనక్కు ఇవ్వాలని, 'పిసా' చట్టాన్ని అమలు చేయాలనే ప్రధాన డిమాండ్లతో **2024 మార్చి 4న ఝార్ఖండ్ రాష్ట్రం-సంతాల్ పరగణా, దుంకా లోని కమిషనర్ కార్యాలయం వద్ద హూల్ జార్ఖండ్ క్రాంతి దళ్ (హెచ్‌జెకెడి) ఆధ్వర్యంలో ధర్నా** నిర్వహించారు. తీవ్ర వర్షాన్ని కూడా లెక్కచేయకుండా పాలం, సింగ్భూమ్, రాంచి, దుంకా, డియోగర్, గడ్డ, పాకూర్ తదితర ప్రాంతాల నుండి ఆదివాసులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ధర్నా అనంతరం జరిగిన బహిరంగ సభకు కామ్రేడ్ శంకర్ నారాయణ, కామ్రేడ్ లలిత్ సోరేన్ అధ్యక్షత వహించారు. మొదట హెచ్‌జెకెడి రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ బిర్సా హేమ్బ్రమ్, కామ్రేడ్స్‌ను ఉత్సాహపరిస్తూ మాట్లాడారు. సంఘం ఉపాధ్యక్షులు కామ్రేడ్ ఠాకూరన్ సోరెన్ విప్లవ గేయాలు ఆలపించి సంతాలి భాషలో ప్రసంగించారు.

ఈ సంస్థ వ్యవస్థాపక సభ్యులైన కామ్రేడ్ శంభూ మహతో, హెచ్‌జెకెడి రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ కొర్నేలుస్ సోరెన్ తదితరులు తమ ప్రసంగాలలో ఆదివాసుల, మూలవాసుల గుర్తింపు, ఉనికి తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నా యన్నారు. ఆదివాసి సమాజాల మనుగడ జల్-జంగిల్-జమీన్, స్వయం పాలనలపై ఆధారపడి ఉందని, అయితే ఆర్ఎస్ఎస్ పరివారం, కొందరు నిరంకుశ ఉన్నత అధికారులు, బహుళజాతి కంపెనీలు, అడవులలో జీవించే ఆదివాసులను విధ్వంసకులని సుప్రీంకోర్టులో వాదనలు చేశారన్నారు.

మోడీ ప్రభుత్వం అటవీ సంరక్షణ చట్టానికి సవరణను 2019లో రూపొందించి, దానిని 2023లో చట్టం చేసిందని, ఈ విధంగా ఆదివాసుల చరిత్ర, సాంప్రదాయం, శతాబ్దాల నాటి వారి హక్కులన్నింటిని నిరాకరిస్తూ, అడవులను కార్పొరేట్లకు అప్పగించడానికి ప్రయత్నాలు చేస్తున్నారన్నారు.

1927లో బ్రిటిష్ వలసవాదులు రూపొందించిన అటవీ చట్టాని కంటే ముందు నుండి వున్న ఆదివాసుల చరిత్రను వక్తలు గుర్తు చేశారు. 1950 నుండి 30 సంవత్సరాల కాలంలో, ఈ చట్టం ఉన్నప్పుడే అభివృద్ధి పేరుతో 45 లక్షల హెక్టార్ల అటవీ భూములను స్వాధీనం చేసుకున్నారని, దాని తర్వాత నూతన ఆర్థిక విధానాల అమలులో 2018-23 మధ్యకాలంలో 90 వేల హెక్టార్ల ఆదివాసుల భూమిని గుంజి వేసుకున్నారని తెలిపారు. ఈ సవరణలు ఈ సంక్షోభాన్ని ఇంకా పెంచుతాయని, ఆదివాసులకే కాక, యావన్మందికి ఇదొక హెచ్చరికగా పేర్కొన్నారు.

ల్యాండ్ బ్యాంక్ సమస్యపై మాట్లాడుతూ జార్ఖండ్‌లో 83% రైతులు, రెండు హెక్టార్ల లోపు భూమిని కలిగి ఉన్నారని చెప్పారు. స్వామినాథన్ పరిశీలనలోనూ కేవలం 0.69% రైతులు మాత్రమే 10 హెక్టార్లకు మించి భూములు కలిగి ఉండగా, దానిలోను సగం మంది తాముగా సాగు చేయడం లేదని తెలుస్తోంది. ప్రజల నిజ కొనుగోలు శక్తి పెరగకపోవటం వలన, వ్యవసాయ పారిశ్రామిక వస్తువులు, సరుకులు, సేవారంగాలు అత్యధిక ప్రజలకు అందుబాటులో ఉండడం లేదన్నారు. కనుక జార్ఖండ్‌లో భూ బ్యాంకు వద్దని, భూసంస్కరణలు అమలు కావాలని వారు డిమాండ్ చేశారు.

ల్యాండ్ బ్యాంక్ ఏర్పరిచే చర్యను ఉపసంహరించుకోవాలని ఈ సభ ఏకగ్రీవంగా డిమాండ్ చేసింది. సేకరించిన భూమిని అంతా ఆయా రైతులకు అప్పగించాలని డిమాండ్ చేసింది. పండిట్ నెహ్రూ ప్రబోధించిన పంచశీలలో, ప్రసిద్ధి చెందిన రెండవ అంశం... భూమి, అడవులపై ఆదివాసుల హక్కుల నిర్వహణ గురించి పేర్కొంటున్నదని తెలిపారు.

మన రాజ్యాంగంలోని ఐదవ షెడ్యూలును, సిఎన్‌టి-ఎస్ఎన్‌టి చట్టాన్ని ఉల్లంఘించి ఆదివాసుల, మూలవాసుల భూములను గుంజుకుంటున్నారని, గతంలో బీహార్ రాష్ట్ర పాలనా కాలంలో సిఎన్‌టి చట్టం నుండి కొందరు మూలవాసులను మినహాయించారని, వారి లక్షలాది ఎకరాల భూములను హస్తగతం చేసుకున్నారని తెలిపారు. తదనంతర కాలంలోను దీనిని సవరించలేదని, ఈ విధంగా సంతాల్ పరగణా చట్ట విరుద్ధంగా మార్పు చెందిందన్నారు.

'పీసా' చట్టాన్ని ఆదివాసులు అమలు చేయించుకోవాలని, 1996లో 'పీసా' ఆదివాసులకు వరంలాగా లభించిందని, అయితే కుంతిలోని 'పాతాళ ఘురి' ఉద్యమంపై క్రూరమైన నిర్బంధం, వేలాదిమంది జైల్లో నిర్బంధించబడటంతో ముగింపు కొచ్చిందన్నారు. హేమంత్ సోరేన్ ప్రభుత్వం వారిపై కేసుల ఉపసంహరణ తర్వాత, ఆ యువజనులు విడుదలయ్యారని పేర్కొన్నారు. ఆదివాసులకు, మూలవాసులకు మరింత స్వయం ప్రతిపత్తి కావాలని, 'పిసా', సిఎన్‌టి-ఎన్‌పిటి వంటి చట్టాలు కూడా వారికి ఏమాత్రం సహకారంగా లేవని తెలిపారు.

సామ్రాజ్యవాద పెట్టుబడిదారీ వ్యవస్థ ఓడించబడకుండా, దోపిడీకి అంతం ఉండదని, చట్టాలు కూడా సక్రమంగా వర్తించవని పేర్కొన్నారు. ముగింపులో మిజోరం ప్రభుత్వం లాగా, జార్ఖండ్ ప్రభుత్వం కూడా అటవీ సంరక్షణ (సవరణ) చట్టం-2023ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీలో బిల్లు పెట్టాలని, ఈ చట్టాన్ని ఆదివాసులకు, ప్రకృతికి వ్యతిరేకమైనదిగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. డిమాండ్లతో కూడిన విజ్ఞాపన పత్రాన్ని సంతాల్ పరగణా కమిషనర్ ద్వారా ముఖ్యమంత్రికి పంపారు.

*****